క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు అన్నారు. పెద్దపల్లిలోని పాత ఎంపీడీవో ఆఫీసు కార్యాలయంలో శనివారం పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ 4వ మహాసభ మామిడిపల్లి తిరుపతి అధ్యక్షతన జరిగింది. జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24, 25న గార్ల పట్టణంలో జరిగే 5వ మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లాలోని కార్మికులంతా తరలిరావాలని కోరారు. నాయకులు ఖాజా, నరేశ్, కనుకయ్య, అశోక్, ముస్తఫా, మల్లేశ్ ఉన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న ఏగోళపు సదయ్యగౌడ్



అవార్డు అందుకుంటున్న సదయ్యగౌడ్

సుల్తానాబాద్: ఏగోళపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఏగోళపు సదయ్యగౌడ్ సామాజిక సేవలను గుర్తించి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జాతీయ ఉత్తమ నంది అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని సౌత్ ఇండియా అవార్డ్స్–2025 కార్యక్రమానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరై శనివారం అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. 21ఏళ్ల నుంచి చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మేర కులస్తులు

మంథని: మంథనిలో మేర సంఘం భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మేర కులస్తులు మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని బతుకమ్మ చౌరస్తా నుంచి ప్రధాన చౌరస్తా వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మేర సంఘం నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎలిగేడు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎలిగేడు ఎస్‌ఐ మధుకర్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలతో పాటు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుగురు ప్రయాణికుల కన్నా ఎక్కువ మందిని ఎక్కించుకోవద్దని, డ్రైవర్ పక్క సీటులో ఎవరినీ కూర్చోనివ్వొద్దని సూచించారు. ప్రయాణికులను ఇబ్బందులు గురి చేస్తే సంబంధిత వ్యక్తులు ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రావణ్‌కుమార్, రాంచంద్రం, సిబ్బంది ఉన్నారు.

బ్యాటరీలు చోరీ

పాలకుర్తి: మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గ్రామపంచాయతీ ఆటో ట్రాలీకి సంబంధించిన బ్యాటరీ, స్టెప్ ఇన్ టైర్‌తో పాటు గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీనివాస్‌కు సంబంధించిన హార్వెస్టర్ బ్యాటరీని దొంగిలించారు. ఉదయాన్నే గమనించిన పంచాయతీ సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సంతోష్ బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొన్నిరోజులుగా గ్రామాల్లో వరుస దొంగతనాలు స్థానికుల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని ఇందుర్తి, గుంపుల గ్రామాల్లో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ భవనం

- నూతన భవనం నిర్మించి, సౌకర్యాలు కల్పించాలని రైతుల డిమాండ్



ఓదెలలో శిథిలావస్థకు చేరిన ఎస్సారెస్పీ భవనం

ఓదెల: ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతుల కోసం ఓదెలలో ఏర్పాటు చేసిన ఎస్సారెస్పీ భవనం శిథిలావస్థకు చేరింది. 1975లో ఎస్సారెస్పీ కాలువలు ఏర్పాటు చేసే సమయంలో ఓదెలలో నిర్మించిన ఎస్సారెస్పీ భవనం నిర్మించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతాంగం సాగుచేసిన చివరి పంటలకు నీరందించడం కోసం ఓదెలలో డివిజన్–1 కార్యాలయం ఏర్పాటు చేశారు. అరకొర సౌకర్యాలతో ఉన్న ఎస్సారెస్పీ భవనం వర్షం పడితే పైకప్పు ఉరవడంతో పాటు ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు నీటి పారకం కోసం రైతులు కార్యాలయానికి వస్తారు. రైతులు కూర్చోవడానికి ఎలాంటి సౌకర్యాలు లేవు. కేవలం మూడు గదులు ఇరుకుగా ఉన్నాయి. ఇటీవల లస్కర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు పెరిగారు. సౌకర్యాలు లేకపోవడంతో చెట్లకిందనే కూర్చుంటున్నారు. కార్యాలయంలో డీఈఈ, జేఈఈ, ఏఈఈలు విధులు నిర్వర్తిస్తుండగా వారికి కూడా కనీస సౌకర్యాలు లేవు. నూతన భవనం నిర్మించి సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

చెట్ల కిందే కూర్చోవాల్సి వస్తోంది



ఓదెలలోని ఎస్సారెస్పీ కార్యాలయం నూతన భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం సౌకర్యాలు లేకపోవడంతో చెట్లకిందనే రైతులు కూర్చోవాల్సి వస్తోంది.

– దొడ్డె స్వామి, రైతు, కొలనూర్

నూతన భవనం నిర్మించాలి



రెండు మండలాలకు కలిపి ఓదెలలో అన్ని హంగులతో ఎస్సారెస్పీ నూతన భవనం నిర్మించాలి. ప్రస్తుతం ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల రైతులకు శిథిలావస్థ భవనంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– కాశవేని చేరాలు, రైతు, గోపరపల్లె



పనిచేయని నిఘానేత్రాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎల్కలపల్లి గేట్, లక్ష్మీపురం గ్రామాల్లో నేరాల నియంత్రణకు దాతల సహకారంతో సుమారు రూ.ఐదు లక్షల వ్యయంతో గ్రామంలో ఎన్టీపీసీ పోలీసులు 34 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎల్కలపల్లి గేట్ రైల్వే ట్రాక్ నుంచి పోరాటపల్లి పోచమ్మ గుడికి వెళ్లే ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. గ్రామంలో కొన్ని సీసీ కెమెరాలు ధ్వంసం కాగా మరికొన్ని కెమెరాలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. ఎల్కలపల్లిగేట్ ప్రాంతంలో రామగుండం ఎరువుల కర్మాగారం, ఐఓసీఎల్ గ్యాస్ ప్లాంట్‌లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు నివాసం ఉంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



సుల్తానాబాద్‌లో ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

- ఈనెల 6వ తేదీన ప్రారంభం

సుల్తానాబాద్: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశానుసారం అధిక మంది ఉత్తీర్ణత సాధించేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. దీంతో ముందుచూపుతో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న జెడ్పీఎస్ఎస్, హైస్కూళ్లలో ఈ నెల 6 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించాయి. ఇప్పటికే హెచ్‌ఎంలు, ఎంఈవోలు ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 102 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 2625 విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

తరగతుల నిర్వహణ ఇలా..

జిల్లావ్యాప్తంగా 102 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 2625 విద్యార్థులు 2025–26కు గాను పదో తరగతి చదువుతున్నారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఈనెల 6 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే జనవరి 2026 నుంచి మార్చి వరకు ఉదయం 8 గంటల నుంచి 9:30 వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వారు తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లావ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో ఈనెల 6వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. సాయంత్రం ఒక గంట సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలి.

– మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

ఆదివరాహస్వామి సేవలో జైపూర్ ఏసీపీ



పూజలు చేస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీఆదివరాహస్వామి ఆలయాన్ని మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ శనివారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఏసీపీని సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆమె నేత్రాలు సజీవం



కొమరమ్మ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో నివాసం ఉంటున్న జోగు కొమరమ్మ(48) శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలను దానం చేయడానికి ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ ప్రదీప్‌తో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకుకు తరలించారు. సమాజహితం కోసం ఆలోచించి ఇద్దరి అంధులకు చూపు ప్రసాదించాలన్న ఉద్దేశంతో నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు భర్త సారయ్య, కుమారులు వంశీకృష్ణ, అరుణ్, కూతురు ప్రగతిని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కమాన్‌పూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సంస్థ సభ్యులు నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రంగంపల్లి, చీకురాయిరోడ్, భూంనగర్, టీచర్స్‌కాలనీ, శివపురికాలనీ, కూనారంరోడ్, వాసవినగర్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఖని, కరీంనగర్ బార్ అసోసియేషన్ క్రికెట్ మ్యాచ్

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని, కరీంనగర్ బార్ అసోసియేషన్ మధ్య ఆదివారం స్నేహపూర్వకమైన క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా రామగుండం కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్, ఏజీపీ రవికుమార్, ఎరుకల ప్రదీప్, వరలక్ష్మి, శ్రీను, శంకర్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని అక్బర్‌నగర్ ఏరియాలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం కోతి పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

వాలీబాల్ పోటీల్లో ఆర్జీ–2 జట్టు విజయం



క్రీడాకారులతో ఎస్ఓటూ జీఎం కరచాలనం

గోదావరిఖని: రామగుండం రీజియన్ స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. పోటీల్లో ఆర్జీ–2 జట్టు విజయం సాధించింది. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని సింగరేణి స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందజేత



సేఫ్టీ పరికరాలు అందజేస్తున్న ఆకుల వెంకన్న

రామగిరి: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న సేఫ్టీ పరికరాలు అందజేశారు. కాంట్రాక్టర్ నాదెం సమ్మయ్య వద్ద పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు శనివారం సేఫ్టీకి సంబంధించిన బూట్లు, హెల్మెట్, రేడియం జాకెట్స్ అందజేశారు. కార్మికులు విధి నిర్వహణలో సేఫ్టీ పరికరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికులు ఓదెలు, సది, రాజయ్య, సంపత్, సదానందం, కుమార్, రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్

రామగిరి: క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి పేరును నిలబెట్టాలని సివిల్ డీజీఎం బి.రాజేంద్రకుమార్ అన్నారు. రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో రీజినల్ స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు డి.టి.రావు, బెల్లం శ్రీనివాస్, ఇన్‌చార్జి పర్సనల్ విభాగాధిపతి వి.సునీల్ ప్రసాద్, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్సా శ్రీనివాస్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణం



పారాయణం చేస్తున్న వికాస తరంగిణి సభ్యులు

జ్యోతినగర్: భక్తాంజనేయ స్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ రామగుండం రింగ్ రోడ్ భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆచార్య తిరు నక్షత్రం సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఈ పారాయణంలో అర్చకులు గోపినాథ్, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి కమిటీ నిర్వాహకులు శ్రీపతిరావు, దీపిక, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ప్రసంగం వీక్షించిన రైతులు



సుల్తానాబాద్: ప్రధానమంత్రి ప్రసంగం వింటున్న ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, తదితరులు

సుల్తానాబాద్: ధనధాన్య కృషి యోజన కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడిన ప్రసంగాన్ని శనివారం రైతులతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు వీక్షించారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్.మనోహర్, డైరెక్టర్లు బొజ్జ మల్లయ్య, బావు రాజేందర్, అప్పాల తిరుమల, పాపని లక్ష్మీనారాయణ, బండ శంకర్, ఇల్లందుల శ్రీనివాస్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..



కాల్వశ్రీరాంపూర్: ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న రైతులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ రైతువేదిక కార్యాలయంలో శనివారం పీఎం ధాన్య యోజన, దళహన్ ఆత్మనిర్భర్ మిషన్ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మార్కెట్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు పరుగు

- పెద్దాపూర్‌లో డ్రైనేజీ లేక ఇబ్బంది



రోడ్డుపై పారుతున్న మురుగు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో డ్రైనేజీ లేక ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రధాన రహదారి సిమెంటు రోడ్డు నిర్మించినా.. మురుగు పారేందుకు డ్రైనేజీ నిర్మించకపోవడంతో సిమెంటు రోడ్డు పైనే మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో రోడ్డు వెంట నడిచి వెళ్లే వాళ్లతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పెద్ద వాహనాలు వచ్చినప్పుడు మురుగు నీరు మీద పడి దుర్వాసనతో పాటు దుస్తులు పాడవుతున్నాయని వాపోతున్నారు. గ్రామంలో ప్రధాన దారి వెంట మురుగు కాల్వలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం



ఇళ్లలోని మురుగు నీరు రోడ్డు పైకి రావడంతో దుర్వాసన వస్తోంది. వాహనాలు వెళ్లినప్పుడు మురుగు నీరు మీద పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించి, డ్రైనేజీ నిర్మించాలి.

– సంకెళ్ల లక్ష్మీనర్సయ్య, పెద్దాపూర్

'అనాథలైన చిన్నారులు'

యైటింక్లయిన్‌కాలనీ: 'బాబాయ్.. నాన్న ఎక్కడున్నాడు' అని ఆ బాలుడు తన చిన్నాన్నను అడగడం స్థానికులను కలచివేసింది. న్యూమారేడుపాకకు చెందిన కోట రాజయ్య – సక్కుబాయి దంపతులకు ముగ్గురు కుమారులు చిరంజీవి, రామ్‌చరణ్, సాయిచరణ్ సంతానం. చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి సక్కుబాయి కుమారులను పెంచింది. చిరంజీవికి 13ఏళ్ల క్రితం గోదావరిఖనికి చెందిన స్వప్నతో వివాహం జరిపించింది. 8ఏళ్ల క్రితం తల్లి అనారోగ్యంతో చనిపోయింది. కూతురు జన్మించగానే భార్య స్వప్న కూడా మృతి చెందింది. అప్పట్నుంచి చిరంజీవి కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కుమారుడు రిత్విక్, కుమార్తె శశిర, ఇద్దరు తమ్ముళ్లతో కలిసి న్యూమారేడుపాకలో ఉంటున్నాడు. పోతనకాలనీ ప్రధాన చౌరస్తాలో మీసేవ కేంద్రం నడుపుతున్నాడు. 10న చిరంజీవి హత్యకు గురవడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

రామగిరి: మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడు చోరీకి గురైన ఘటన రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముల్కలపల్లికి చెందిన బొల్లపల్లి పద్మ(52)కు జ్వరం రావడంతో శనివారం సెంటినరికాలనీ తెలంగాణ చౌరస్తాలోని ఓ ఆర్ఎంపీ వద్దకు వచ్చి చికిత్స పొందింది. అనంతరం తన భర్త బొల్లపల్లి దశరథం గౌడ్‌తో కలిసి బైక్‌పై ముల్కలపల్లికి వెళ్తుండగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోంచి రెండున్నర తులాల పుస్తెల తాడును లాక్కొని పారిపోయారు. పుస్తెలతాడు విలువ సుమారు రూ.2లక్షల50వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజ్‌లో అగాస్ 2కే25



వేడుకల్లో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ఇంజనీరింగ్ (అటానమస్) కాలేజీలో శనివారం ఇంజనీరింగ్, డిప్లొమా అగాస్ 2కే25 ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రతిభా నైపుణ్యాలను పెంచుకుంటే ఉద్యోగావకాశాలు దక్కుతాయన్నారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, రాజిరెడ్డి, వంశీరాజ్ ఉన్నారు.